క్లుప్తంగా

నేడు సచివాలయ భవనం ప్రారంభం

ఎన్‌పీకుంట: వెలిచలమల పంచాయతీ కేంద్రంలో రూ.40 లక్షల ఎంజీఎన్‌ఆర్‌జీఈఎస్ నిధులతో నిర్మించిన సచివాలయ భవనాన్ని గురువారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే సిద్దారెడ్డి ప్రారంభించనున్నారు. బుధవారం ఎంపీపీ రాము, మండల కన్వీనర్ కొత్త రంగారెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల కన్వీనర్లు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

85 మందికి కంటి పరీక్షలు



జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో మందులు అందజేస్తున్న సిబ్బంది

ధర్మవరం: ప్రతి ఒక్కరికి సంపూర్ణ ఆరోగ్యం అందించడమే లక్ష్యమని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సెల్వి సాల్మన్ తెలిపారు. పట్టణంలోని పీఆర్‌టీ వీధిలోని స్త్రీశక్తి భవన్‌లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ.. వార్డులో మొత్తం 280 మందికి వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. 85 మందికి కంటి పరీక్షలు చేసినట్లు పేర్కొన్నారు. వీరిలో అవసరమైన వారికి కళ్లద్దాలను అందించామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మానవసేవే మాధవసేవ



జ్ఞాపికలు అందిస్తున్న ఇంటర్నేషనల్ వాసవీరత్న చంద్రశేఖర్ గుప్తా

ధర్మవరం అర్బన్: సామాజిక సేవతోనే తృప్తి లభిస్తుందని ఇంటర్నేషనల్ వాసవీ రత్న చంద్రశేఖర్‌గుప్తా తెలిపారు. బుధవారం పట్టణంలోని మార్కెట్‌లో ఉన్న వాసవీక్లబ్ చారిటబుల్ ట్రస్ట్‌లో ధర్మవరంలో వాసవీక్లబ్ ఏర్పాటు చేసి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఇంటర్నేషనల్ వాసవీ రత్న చంద్రశేఖర్‌గుప్త మాట్లాడుతూ.. మానవసేవే మాధవసేవ అన్న స్ఫూర్తితో పేదలకు సాయం చేయడం జరుగుతోందన్నారు. క్లబ్ సేవలు మరింత ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. అనంతరం వాసవీక్లబ్ ఆసుపత్రికి సేవలందిస్తున్న వారికి మెమెంటోలు అందించారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ రీజనల్ చైర్మన్ దేవత నాగ సత్య శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి సతీమణి కేతిరెడ్డి సుప్రియ

ధర్మవరం: పట్టణంలోని 14వ వార్డు జగజ్జీవన్ రామ్‌నగర్‌కు చెందిన బాలకృష్ణ ఈనెల 5వ తేదీన అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సతీమణి కేతిరెడ్డి సుప్రియ బుధవారం ఎమ్మెల్యే నివాసంలో రూ.20 వేల నగదును బాధిత కుటుంబ సభ్యులకు అందించారు.

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

తనకల్లు: మండల పరిధిలోని తురకవాండ్లపల్లి అభయ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు బుధవారం నిర్వహించారు. రెండో రోజు స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. భాజభజంత్రీలతో పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. మహోత్సవానికి పెద్ద ఎత్తున భక్తులువిచ్చేశారు.

విద్యా సంస్థల బంద్

నల్లచెరువు/కదిరి అర్బన్: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నల్లచెరువు, కదిరిలో పాఠశాలల బంద్ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం వైఎస్సార్ జిల్లా కడపలో ఉక్కు కార్మాగారాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తే సహించేది లేదన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ లక్షల మందికి ఉపాధి కల్పిస్తోందని పేర్కొన్నారు. ఇలాంటి ప్లాంట్‌ను మూసేయాలని చూస్తే ఆందోళన చేస్తామన్నారు. ఆయా కార్యక్రమాల్లో జ్ఞానేంద్ర, గణేష్, లోకేష్, అశోక్ రాజేంద్రప్రసాద్, పవన్, విజయ్ పాల్గొన్నారు.

మాది రైతు సంక్షేమ ప్రభుత్వం

- సీఎం సభకు హాజరైన వారందరికీ కృతజ్ఞతలు
- రానున్నది మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే
- ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి





తనకల్లు మండలం రామప్పకుంట తండాలో కార్యకర్తను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి, కదిరిలో ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జర్నలిస్టులు

కదిరి: 'మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డితో పాటు ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి రైతులంటే ఎంతో ప్రేమ. రైతుల కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారు. ఈ ప్రభుత్వం ఈ నాలుగేళ్లలోనే రైతుల సంక్షేమానికి రూ.1.75 లక్షల కోట్లు ఖర్చు చేసింది. వైఎస్సార్‌సీపీ రైతు సంక్షేమ ప్రభుత్వం.' అని కదిరి ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎమ్మెల్యే తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. పుట్టపర్తిలో జరిగిన ముఖ్యమంత్రి సభకు రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారన్నారు. ఆ రైతులను చూసి టీడీపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని చెప్పారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా వైఎస్సార్‌సీపీ సిద్ధంగా ఉందన్నారు. మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి సభకు హాజరైన ప్రతి రైతన్నకు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులందరికీ పేరు పేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. జిల్లాలో కరువు మండలాలుగా కొన్నింటిని మాత్రమే కేంద్రం గుర్తించిందని తెలిపారు. అన్ని మండలాలను కరువు మండలాలుగా గుర్తించాలని జిల్లాలోని ఎమ్మెల్యేలందరం కలసి సీఎం దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన సీఎం జగన్.. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడతామని చెప్పినట్లు పేర్కొన్నారు.

కదిరిలో జర్నలిస్టుల బైక్ ర్యాలీ..

కదిరి: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల పంపిణీకి రాష్ట్ర కేబినెట్ ఆమోదించడంతో బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేస్తూ పట్టణంలో జర్నలిస్టులు బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లా నుంచి వేమారెడ్డి సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్ మీదుగా బైక్ ర్యాలీ ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి ఇంటి వద్దకు చేరుకుంది. అనంతరం జర్నలిస్టులందరూ కలిసి ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇళ్ల స్థలాల పంపిణీకి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదముద్ర వేయడంపై జర్నలిస్టుల తరఫున సీఎంకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండటం వైఎస్ కుటుంబానికే చెల్లుతుందన్నారు. కదిరి నియోజకవర్గంలోని అక్రెడిటేషన్ కలిగి ఉన్న ప్రతి పాత్రికేయుడికి త్వరలోనే 3 సెంట్ల చొప్పున ఇంటి స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సీనియర్ పాత్రికేయులు కుటాగుళ్ల ప్రసాద్, కోలా వెంకటరమణ మాట్లాడుతూ.. ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం ముందుకు రావడం శుభ పరిణామమన్నారు. ముఖ్యమంత్రితో పాటు స్థానిక ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని చెప్పారు. జగన్ తన పాదయాత్రలో భాగంగా కదిరి నియోజకవర్గంలో పర్యటించినప్పుడు జర్నలిస్టులకు ఇచ్చిన ఇళ్ల స్థలాల పంపిణీ హామీని ఇప్పుడు నెరవేర్చారని కొనియాడారు. అక్రిడిటేషన్ కల్గి ఉన్న జర్నలిస్టులతో పాటు అక్రిడిటేషన్ లేని వర్కింగ్ జర్నలిస్టులకు కూడా ఇంటి పట్టా ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయాన్ని కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో కదిరికి చెందిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు పాల్గొన్నారు.

పరామర్శ

తనకల్లు: మండల పరిధిలోని రామప్పకుంట తండాకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రమణానాయక్ ఇటీవల పాముకాటుకు గురయ్యాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి బుధవారం తండాకు విచ్చేసి, రమణానాయక్‌ను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, నాయకులు శ్రీనివాసులునాయుడు, ఉపాధ్యాయుడు కొర్ని చంద్రమౌళిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దిశ చట్టంపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

బత్తలపల్లి: ప్రతి బాలిక దిశ చట్టంపై అవగాహన పెంచుకోవాలి. మహిళలకు రక్షణ కల్పించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ చట్టాన్ని తీసుకొచ్చారని ఎస్‌ఐ పి.శ్రీనివాసులు అన్నారు. బుధవారం స్థానిక ఆర్డీటీ ఆసుపత్రిలో దిశ యాప్ డౌన్‌లోడ్, రిజిస్ట్రేషన్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలపై లైంగిక దాడి, ఇతర క్రూరమైన నేరాలకు పాల్పడే వారికి ఉరిశిక్ష విధిస్తారని తెలిపారు. 21 రోజుల్లోనే తీర్పు వెలువరిస్తారన్నారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల విచారణకు ప్రతి జిల్లాలో ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పిల్లలపై లైంగిక నేరాలకు పాల్పడే వారికి 10 నుంచి 14 ఏళ్ల వరకూ జైలు శిక్ష విధించే అవకాశం ఉందని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో మహిళలను కించపరిచేలా పోస్టింగ్‌లు పెడితే 2 నుంచి 4 ఏళ్ల జైలు శిక్ష విధించడం జరుగుతుందన్నారు. అనంతరం పలువురు యువతులు, మహిళల సెలోఫోన్లలో దిశ యాప్ డౌన్‌లోడ్ చేయించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ సోమశేఖర్‌మూర్తి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి పథకాలు వివరించాలి



మాట్లాడుతున్న కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి

బత్తలపల్లి: మీ గ్రామాల్లోని ప్రతి గడపకు వెళ్లండి.. వారికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించండి. మంచి జరిగి ఉంటే మాకు మద్దతు ఇవ్వండంటూ ప్రజలకు వివరించాలని ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని డి.చెర్లోపల్లి, దంపెట్ల, ఓబుళాపురం, అప్పరాచెరువు, పోట్లమర్రి గ్రామ సచివాలయాలను సందర్శించారు. అనంతరం సర్పంచులు గుజ్జల రమాదేవి, చల్లా కరుణాకర్‌నాయుడు, బండి సరస్వతి, మొర్రెడ్డిగారి శారదమ్మ, అక్కిం దామోదర్ అధ్యక్షతన గృహసారథులు, పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గొల్లపల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ రాంభూపాల్‌రెడ్డి, మాజీ కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, వైస్ ఎంపీపీ గజ్జెల వెంగళరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ పాలనకు, ఇప్పటి జగనన్న పాలనలో తేడాను జనం గమనించారన్నారు. కరోనా కష్టకాలంలో ప్రజలకు అండగా నిలిచిందెవరో ప్రజలకు తెలుసన్నారు. గత ప్రభుత్వం జన్మభూమి కమిటీలు చేసిన దౌర్జన్యాలను ప్రజలకు వివరించాలన్నారు. పార్టీలు, కులాలకు, మతాలకు అతీతంగా అందరికీ సమన్యాయం అందిస్తున్న జగనన్న, ఎమ్మెల్యే కేతిరెడ్డికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు సుజాత, బండి రమణమ్మ, నాయకులు చల్లా క్రిష్ణమనాయుడు, గుజ్జల మునలప్ప, చెన్నారెడ్డి, బండి వీరనారప్ప, పెదప్ప, నాగన్న, నాగభూషణ, శేఖర్, వెంకటరంగారెడ్డి, లింగమయ్య, ఈశ్వరయ్య, హరినాథ్, హనుమంతరెడ్డి, వెంకటరెడ్డి, సుధాకరరెడ్డి, దినేష్‌కుమార్‌రెడ్డి, రమణారెడ్డి, జాంపుల చంద్రమోహన్, చెన్నక్రిష్ణారెడ్డి, నాగభూషణ, నరేంద్రరెడ్డి, ఆంజనేయులు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటిని వృథా చేయొద్దు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

కదిరి టౌన్: పట్టణంలోని మున్సిపల్ హెడ్ వాటర్ ట్యాంక్ వద్ద బుధవారం మెప్మా ఆధ్వర్యంలో జల్ దీపావళి కార్యక్రమంపై మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మెప్మా టిఎంసీలు శ్రీనివాసరెడ్డి, తౌసిఫ్, గిరి మాట్లాడుతూ.. నీటి విలువను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. నీరు వృథా కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మహిళలపై ఉందన్నారు. అనంతరం ఫిల్టర్‌లో శుద్ధమైన నీటిని పట్టణంలోని కుళాయిలకు సరఫరా చేసే విధానాన్ని వివరించారు. అనంతరం మహిళలకు బ్యాగులు, వాటర్ బాటిళ్లు, నీటి గ్లాసులను పంపిణీ చేశారు.

ధర్మవరం అర్బన్: స్థానిక కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన స్వచ్ఛ దీపావళి-శుభ దీపావళి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ఆవరణలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి, పారిశుధ్య పనులు చేపట్టారు. మొక్కలకు కంచెలను ఏర్పాటు చేశారు. పిచ్చి మొక్కలను తొలగించి కళాశాల ప్రాంగణమంతా ఈనెల 12వ తేదీ వరకూ ఈ కార్యక్రమం చేపట్టనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గోపాల్‌నాయక్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ త్రివేణి, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, పాల్గొన్నారు.

సుడిదోమతో పంటకు తీవ్ర నష్టం



వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ షాదాబ్

తలుపుల: సుడిదోమతో వరి పంటకు నష్టం వాటిల్లుతుందని ఏఓ షాదాబ్ తెలిపారు. బుధవారం ఏఈఓ రహంతుల్లా, వీహెచ్‌ఏ యాసిన్‌తో కలిసి వివిధ గ్రామాల్లో సాగు చేసిన వరి పొలాలను పరిశీలించారు. సుడిదోమ వరి కంకులు ఏర్పడే సమయంలో పంటను ఆశిస్తుందన్నారు. తెగులు తీవ్రత ఎక్కువైతే మొక్కలు చనిపోతాయన్నారు. సుడిదోమ నివారణకు నత్రజని సంబంధిత ఎరువులు వాడాలని సూచించారు. పొలాన్ని తరచూ ఆరబెట్టాలన్నారు. ప్రతి 2 మీటర్లకు 20 సెంటీ మీటర్ల కాలిబాట వదలాలని తెలిపారు. తొలిదశలో ఎసిఫేట్ 1.5 గ్రాములు, ఇథిఫెనాపిక్స్ 20 మిల్లీలు 1 లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. ఉధృతి ఎక్కువగా ఉంటే డైనోటిఫ్యూరాన్ 0.4 గ్రాములు, పై మెట్రోజైన్ 0.60 గ్రాములు ఏదో ఒకటి లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలన్నారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో జోష్



సభలో ఉత్సాహంగా చిందులేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

- సీఎం వైఎస్ జగన్ సభ విజయవంతం

పుట్టపర్తి: వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్ సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు పుట్టపర్తికి వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సత్యసాయి జిల్లా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. సత్యసాయి, అనంతపురం జిల్లాల నుంచి రైతులు, వైఎస్సార్‌సీపీ అభిమానులు సీఎం సభకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. జై జగన్ నినాదాలతో సభ మార్మోగింది. పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సమీపంలోని వై జంక్షన్ వద్ద సభ నిర్వహించగా 5 కిలోమీటర్ల మేర జనసందోహం కనిపించింది. రైల్వే స్టేషన్ వద్ద నుంచి ఎయిర్ పోర్ట్, పోలీస్ పెరేడ్, జానకీరామయ్య పెట్రోల్ బంక్ వరకూ రోడ్లు మొత్తం జనాలతో నిండిపోయాయి. పుట్టపర్తిలో సీఎం జగన్ బహిరంగసభ విజయవంతంతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో జోష్ వచ్చింది. వైఎస్సార్‌సీపీ కి ప్రజలు మద్దతు తెలపడంతో తెలుగు తమ్ముళ్లు పూర్తిగా డీలా పడ్డారు. సభ విజయవంతానికి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి కృషి చేశారు. అధికారులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల సహకారంతో సభ విజయవంతంగా ముగిసింది.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు అర్హత

కదిరి అర్బన్: ఇటీవల అనంతపురంలో జరిగిన జిల్లాస్థాయి సీనియర్ మీట్ బాక్సింగ్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని ఎస్ఎంజేఎల్ డిగ్రీ ప్రిన్సిపాల్ రమేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 46-49 వెయిట్ కేటగిరీలో కిరణ్‌కుమార్, 60-64 వెయిట్ కేటగిరీలో వేణు రాష్ట్రస్థాయి సీనియర్ మీట్ బాక్సింగ్ పోటీలకు అర్హత సాధించారన్నారు. ఈనెల 13 నుంచి 25వ తేదీ వరకూ విశాఖపట్నంలో జరిగే పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు.

తక్షణసాయం అందజేత



వైఎస్సార్ బీమా తక్షణసాయం అందిస్తున్న సచివాలయ సిబ్బంది, నాయకులు

గాండ్లపెంట: ఇటీవల మండల పరిధిలోని వద్దిరెడ్డిపల్లికి చెందిన శంకరమ్మ, మండల కేంద్రానికి చెందిన రసపుత్ర బాబుసింగ్ మృతి చెందారు. బుధవారం వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.20 వేల నగదును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మహమ్మద్‌రఫీ, సంక్షేమ కార్యదర్శి రుక్సానా, సర్పంచ్ రహంతుల్లా, కన్వీనర్ గజ్జలర వీంద్రారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు ఎస్పీ హైదర్‌వలీ, బీసీ కన్వీనర్ జక్కల లక్ష్మీనరసింహగౌడ్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇక్బాల్, సికిందర్, వలంటీర్లు ఆజాద్, నటరాజ్ పాల్గొన్నారు.

పుట్టపర్తి నూతన కమిషనర్‌గా రాంభూపాల్ రెడ్డి

పుట్టపర్తిరూరల్: పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్‌గా రాంభూపాల్ రెడ్డిని ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. హిందూపురం మున్సిపాలిటీ అదనపు కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ఈయన్ను పుట్టపర్తి కమిషనర్‌గా నియమించారు. గతంలో ఇక్కడ పని చేసిన మధుసూదన్ రెడ్డి సెలవులో వెళ్లారు.

టపాసుల దుకాణాలకు లైసెన్స్ తప్పనిసరి

నల్లచెరువు: దీపావళి పండుగ సందర్భంగా మండల పరిధిలో టపాసుల దుకాణాలను ఏర్పాటు చేసుకునే వారు తప్పనిసరిగా లైసెన్స్‌లు కలిగి ఉండాలని ఎస్‌ఐ లింగన్న బుధవారం తెలిపారు. టపాసుల దుకాణాల యజమానులు ప్రభుత్వ నిబంధనల మేరకు నడుచుకోవాలన్నారు. అధికారులు నిర్దేశించిన ప్రదేశాల్లో మాత్రమే దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనుమతులు లేకుండా టపాసులను రవాణా చేసినా, నిల్వ ఉంచినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డిసెంబర్ 17న ఉచిత సామూహిక వివాహాలు

పుట్టపర్తి రూరల్: డిసెంబర్ 17న ఉచిత సామూహిక వివాహాలు నిర్వహిస్తున్నట్లు సాయిభక్తుడు, ప్రముఖ బిల్డర్ చల్లా సాయికృష్ణ (కిట్టు) తెలిపారు. సత్యసాయి బాబా 98వ జయంతిని పురస్కరించుకుని కొత్తచెరువు మండలం లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో ఉచిత సామూహిక వివాహాలు చేస్తామన్నారు. యువకుడికి 21 ఏళ్లు, యువతికి 18 ఏళ్ల వయస్సు ఉండాలని తెలిపారు. పర్తిసాయి ధర్మశాల కార్యాలయంలో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 9959470446, 9440683885 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

హైఓల్టేజీతో కాలిపోయిన కంప్యూటర్లు

కనగానపల్లి: కనగానపల్లిలో విద్యుత్ సరఫరాలో సంభవించిన హైఓల్టేజీ సమస్యతో తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో కంప్యూటర్లు కాలిపోయాయి. బుధవారం ఉదయం కరెంట్ సరఫరాలో తలెత్తిన హెచ్చుతగ్గుల సమస్య వల్ల కార్యాలయంలోని మూడు కంప్యూటర్లలో షాట్ సర్క్యూట్ జరిగి కాలిపోయినట్లు డీటీ ప్రసాద్ తెలిపారు. యూపీఎస్ సౌకర్యం కూడా సరిగా లేకపోవటంతో పనులన్ని ఆగిపోయినట్లు సిబ్బంది తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కూడా రెండు క్రితం హైఓల్టేజీ సమస్య వల్ల రెండు కంప్యూటర్లు కాలిపోయినట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులను నివారించాలని అధికారులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఆటో డ్రైవర్‌పై దాడి

కదిరి టౌన్: పట్టణంలోని నానాదర్గా వీధిలో నివాసం ఉంటున్న ఆటో డ్రైవర్ పటాన్ ముబారక్‌పై మంగళవారం రాత్రి పాత గొడవల నేపథ్యంలో దాడి జరిగింది. పట్టణానికి చెందిన సోహైల్, శోభన ఇస్మాయిల్, టిపా అహ్మద్, ఇర్ఫాన్ దాడి చేయడంతో ఆటో డ్రైవర్ ముబారక్‌కు రక్తగాయాలయ్యాయి. క్షతగాత్రుడికి కదిరి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. ముబారక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్‌ఐ ఇస్మాయిల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

అమడగూరు: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం సీజ్ చేసినట్లు ఎస్‌ఐ బలరామయ్య పేర్కొన్నారు. ఓడీచెరువుకు చెందిన శంకర అక్రమంగా ఓడీచెరువు నుంచి ఇసుకను తరలిస్తుండగా తహసీల్దార్ కార్యాలయం వద్ద పట్టుకుని సీజ్ చేశామన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

డ్రిప్ పైపుల చోరీపై ఫిర్యాదు

కదిరి అర్బన్: తన పొలంలోని డ్రిప్ పైపులను ఎవరో దొంగిలించారని పట్నం గ్రామానికి చెందిన రైతు పఠాన్ వలీబాబా బుధవారం రూరల్ మండల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సేద్యం చేసేందుకు 30 డ్రిప్ బండళ్లు తెప్పించి పొలంలో పెట్టినట్లు తెలిపాడు. పైపుల విలువ సుమారు రూ.1,05,000 ఉంటుందని బాధితుడు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సూర్యనారాయణ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

తలుపుల: మండలంలోని కొరుగుట్టుపల్లి-సిద్దుగూరిపల్లి సమీపంలోని పేకాట స్థావరంపై ఎస్‌ఐ మగ్బుల్‌బాషా ఆధ్వర్యంలో బుధవారం పోలీసులు దాడి చేశారు. 9 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. మరో నలుగురు పారిపోయినట్లు తెలిపారు. 6 ద్విచక్ర వాహనాలు, రూ.71,090 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు. ఘటనా స్థలాన్ని రూరల్ సీఐ వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

తనకల్లు: మండల పరిధిలోని దుగినేపల్లి రామస్వామి దేవాలయ నిర్మాణానికి ప్రముఖ పారిశ్రామిక వేత్త ఎంజీ రెడ్డి బుధవారం రూ.50,116లను విరాళంగా అందజేశారు. ఆ మొత్తాన్ని ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులకు అందించారు. అడిగిన వెంటనే విరాళం అందజేసిన ఎంజీ రెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు నరసింహారెడ్డి , నరసింహులు, శ్రీధర్‌రెడ్డి, బావాజీ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్యార్మీ వేడుకలు

తాడిమర్రి: మండలంలోని నాయనపల్లి గ్రామంలో బుధవారం ముస్లింలు గ్యార్మీ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. దస్తగిరి, అన్వర్, బాబాఫక్రుద్దీన్, బాషా తదితరులు గ్రామస్తులతో కలసి దస్తగిరి కట్ట వద్ద దస్తగిరి స్వామిని నూతన వస్త్రాలు, పూలమాలలతో అందంగా అలంకరించారు. అనంతరం దస్తగిరి స్వామిని మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో వీధుల్లో ఊరేగించారు. అనంతరం గ్రామస్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో రాము, శంకర్, చిన్న యల్లప్ప, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉపాధి పనులపై ప్రజావేదిక

తాడిమర్రి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీపై ప్రజా వేదిక నిర్వహిస్తున్నట్లు ఏపీఓ సంజీవరెడ్డి బుధవారం తెలిపారు. మండలంలోని గ్రామాల్లో 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకూ జరిగిన ఉపాధిహామీ పనులు, వైఎస్సార్ సామాజిక భద్రత పింఛన్ల పంపిణీపై సామాజిక తనిఖీ బృందం క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టిందన్నారు.

ధర్మవరంలో..

ధర్మవరం రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఏపీఓ ఎంపీడీఓ సౌజన్య కుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని గ్రామాల్లో 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు జరిగిన ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ సిబ్బంది ఇటీవల నిర్వహించిన తనిఖీల్లోని అంశాలను ప్రజా వేదికలో వెల్లడిస్తారన్నారు.

క్రీడాదుస్తుల వితరణ



క్రీడాకారులతో ఉపాధ్యాయ బృందం

చెన్నేకొత్తపల్లి: మండలంలోని న్యామద్దల ఉన్నత పాఠశాలలో వివిధ క్రీడల్లో ప్రతిభ చూపుతున్న విద్యార్థులకు పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన విజయభాస్కర్, చెన్నారెడ్డిలు బుధవారం క్రీడా దుస్తులు వితరణ చేశారు. 32 మందికి రూ. 20 వేల విలువ చేసే దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఆనంద్ నాయక్, పీఈటీ కుమార రాజు, ఉపాధ్యాయులు రాజశేఖర్, సుధాకర్ పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలి

బత్తలపల్లి: మండల కేంద్రంలో ఇళ్లు లేని నిరుపేదలందరికీ వెంటనే ఇంటి పట్టాలు పంపిణీ చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు, రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య అధికారులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం జిల్లా నాయకులు కుళ్లాయప్ప, మండల కార్యదర్శి బండల వెంకటేష్, ప్రసన్న పాల్గొన్నారు.